ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | సెప్టెంబరు 04, 2026 | సంపుటి : 7 | సంచిక : 82 | పేజీలు : 2




## తెలంగాణ ఎన్.ఆర్.ఐలకు సడలింపులివ్వండి

- అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు వినతి

- హైకమాండ్‌ను సీఎం బ్లాక్‌మెయిల్ చేశారు
- తన కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- నా బర్తరఫ్‌కు ఆ నలుగురే కారణం
- నేను తప్పు చేయలేదు. నాకు పశ్చాత్తాపం లేదు
- మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ హ్యాపీగా లేరు
- ముగ్గురికి పదవులు రావడం సంతోషం
- చిన్నారెడ్డిపై వేటు వేయడం సరికాదు
- మీడియాతో కొండా సురేఖ
- అధిష్ఠానానికి ఇచ్చిన లేఖ విడుదల



# నేను తప్పు చేయలేదు

## సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి నన్ను బర్తరఫ్ చేశారు

**హైదరాబాద్, ఆయుధం:** సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ఆరోపించారు. ఆరోపించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలన్న నిర్ణయంపై కొండా సురేఖ స్పందించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. తనని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండించారు. నిర్ణయానికి ముందు తన వివరణ తీసుకోవాల్సి ఉందని. తన కుమార్తె వ్యాఖ్యలకు తననెలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు.

''సీఎం రేవంత్‌రెడ్డిపై, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్ ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్ రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉంది. నా వివరణ వినకుండా నేరుగా తొలగించటం సరికాదు. నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?. నేను ఏ తప్పు చేయలేదు నాకు పశ్చాత్తాపం లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువగా అభిమానించాను. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని నేనే ముందు కోరుకున్నా. నాపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నా. భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదు. నా వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరం. కోసం చిన్నారెడ్డిపై వేటు వేయడం సరికాదు.'' అని కొండా సురేఖ పేర్కొన్నారు.

### మంత్రులు బయటకు వచ్చి చెప్పుకోండి: సురేఖ

**ఉరిశిక్ష వేసే ఖైదీ కైనా చివరి కోరిక ఏంటి అని అడుగుతారు అలాంటిది కాంగ్రెస్లో ఉన్న నన్ను ఏమి ప్రశ్నించకుండా భర్తరఫ్ చేయడం బాధాకరం. దీనిని నేను ఖండిస్తున్నాను. హై కమాండ్ కు నాపై కోపం లేదు. కేవలం సీఎం రేవంత్ రెడ్డి అతని మనుషుల సంతోషం కోసమే నన్ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేశారు. కాంగ్రెస్ లో ఉన్న మంత్రులు ఎవరు హ్యాపీగా లేరు.. బయటికి వచ్చి తమ బాధలు చెప్పుకోవాలని మంత్రులకు సురేఖ పిలుపునిచ్చారు.**

తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి, కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మరికొందరు ఉన్నారని సురేఖ అన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్ పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్డీ సుమంత్ ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని సురేఖ తెలిపారు.

### సుమంత్‌పై వేధింపులు

కొండల్ రెడ్డి మనుషులే వసూళ్లకు పాల్పడి తమ మనిషి అయిన సుమంత్ పై కేసు పెట్టారు. కావాలనే సుమంత్ ను ఇబ్బంది పెడుతున్నారు దానిని ఉపసంహరించుకోవాలని సురేఖ ప్రభుత్వాన్ని పోలీసు అధికారులను కోరారు. ముఖ్యమంత్రిని నా కూతురు ఏదో అంటే నాపై కక్ష తీర్చుకోవడం కరెక్ట్ కాదు. నేను ఏమి తప్పు చేశాను కనీసం కారణం చెప్పకుండా బీసీ మహిళనైనా నన్ను మంత్రి పదవి నుండి తొలగించడం బాధాకరం. మా కాళ్ళు మొక్కి తమ నియోజకవర్గాలలో వారికి గెలుపు కోసం మమ్మల్ని తిప్పుకున్న వారు కూడా ఈరోజు మాపై మాట్లాడుతున్నారు. మా నియోజకవర్గంలోనే ఉన్న ఒక ఎమ్మెల్సీ తనకు తన భార్య కూడా ఓటు వేయదు అటువంటివాడు కూడా మాపై మాట్లాడుతున్నాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్టానానికి తెలియకుండా ఒక నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేలు ప్రకటించడం అధిష్టానాన్ని ధిక్కరించినట్లు కాదా? ఇందిరాగాంధీని సోనియాగాంధీని తిట్టినవారు అందరూ పదవులలో ఉన్నారు.. నేను ఏ రోజు ముఖ్యమంత్రి కానీ అధిష్టానాన్ని కానీ ఒక మాట అనకున్నా మంత్రి పదవి నుండి తొలగించారు. తనను భర్త రఫ్ చేయడానికి ముఖ్యమంత్రి సోదరులు కొండల్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లే కారణం. ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరు హ్యాపీగా లేరు.'' అని కొండా సురేఖ పేర్కొన్నారు.



## కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణి

**వరంగల్, ఆయుధం:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాజకీయాల్లో కీలక సామాజిక సమీకరణలకు శ్రీకారం చుట్టింది. మాజీ మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్ పర్సన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన కీలక నాయకురాలు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చిన నేపథ్యంలో పద్మశాలి సామాజిక వర్గంలో నెలకొనే అసంతృప్తిని తృప్తి పరిచేందుకే కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పద్మశాలి సమాజానికి చెందిన గుండు సుధారాణి గతంలో రాజ్యసభ సభ్యురాలిగా, వరంగల్ మేయర్‌గా విశేష సేవలు అందించారు. అదే సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖ స్థానంలో బిసిపద్మశాలి వర్గానికే చెందిన మరో సీనియర్ నాయకురాలికి ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గం మద్దతు తగ్గకుండా చూసుకునేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.




## విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

- దేశంలోనే పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ప్రవేశం పెట్టిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ
- తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




## భద్రకాళి బండ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ వెంకన్న




## గోల్డ్ యూటర్న్..

- తగ్గినట్లే తగ్గి మళ్లీ ₹1.60 లక్షల స్థాయికి



## సంక్షేమం.. అభివృద్ధే ధ్యేయం

- డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి
- కాంగ్రెస్ '1000 రోజుల పాలన' సంబరాలు

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల ప్రజా రంజక పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, హనుమకొండ జిల్లా పరిధిలోని ఎర్రగట్టు గుట్ట జంక్షన్‌లో గురువారం సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. హసన్‌పర్తి మండలం అధ్యక్షులు అశోక్, 1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము గౌడ్, 65వ డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున విజయ ర్యాలీ నిర్వహించారు. రహదారి పొడవునా కాంగ్రెస్ జెండాలు చేతబూని, ప్రభుత్వ విజయోత్సవ నినాదాలతో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ: 1000 రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రజా పాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ రేవంత్ రెడ్డి సర్కార్ నెరవేరుస్తోందని, సంక్షేమ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ సంబరాల్లో హసన్‌పర్తి మండలం, స్థానిక డివిజన్లకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



- ఎరువులకు కరువు.... యాప్ లో బుకింగ్ తిప్పలు
- ప్రభుత్వ భరోసా దక్కక పెరిగిన రైతు ఆత్మహత్యలు
- పంట కొనుగోలు కేంద్రాలు బంద్
- రైతు బీమాకు రాం రాం
- రుణమాఫీ రైతులకు కుచ్చుటోపి
- కరెంటు కోతలు రైతుల గోస
- బీఆర్ఎస్ పోరుబాటలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

## నాడు సాగు సంబురం.. నేడు సంక్షోభం

**వర్ధన్నపేట, ఆయుధం;** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తోందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత అరూరి రమేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలన నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్ర పరిధిలోని కాట్రాయాల గ్రామంలో వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్ రంగాల విధ్వంసం పై SRSP కెనాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను ప్రజలకు ఇచ్చిన మాటగా భావించి వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో కూడా రైతు సమస్యపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీని చేస్తామని చెప్పి రైతులకు చేసింది సున్నా మాత్రమే, రైతు భరోసా కింద ఏటా ఎకరానికి రూ. 15,000, వ్యవసాయ కూలీలకు రూ. 12,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ఏం చేశారు? రేవంత్ ప్రభుత్వం ఇప్పటి వరకు 5 సీజన్లు ఎగ్గొట్టింది. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 28,720 కోట్లు బాకీ పడింది. గెలిచాక చెప్పింది ఏంటి? మీరు చేస్తున్నది ఏంటి? మీ పాలన ఇక చాలు రేవంత్ అని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ SIR, సభ్యత్వ నమోదు ఇంచార్జి మసూద్ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





## వీసా రూల్స్ లో తెలంగాణ ఎన్.ఆర్.ఐలకు
# సడలింపులివ్వండి

- అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు వినతి

**వరంగల్, ఆయుధం:** ఐటీ సాఫ్ట్ వేర్, ఉన్నత చదువుల కోసం అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ ఎన్ఆర్ఐలకు వీసా నిబంధనల్లో సడలింపులివ్వాలని అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు కోరారు. వివిధ దేశాల్లో పార్లమెంట్ ల పనితీరుపై అధ్యయనంలో భాగంగా అమెరికా పర్యటనలో ఉన్న రవీందర్ రావు వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ ప్రతినిధి సుహాస్ సుబ్రమణ్యం, 11వ డిస్ట్రిక్ట్ ప్రతినిధి జేమ్స్ వాకిన్ షాలను కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమించిన తీరును, స్వరాష్ట్రం ఏర్పాటైన విషయాలను వివరించగా, వారు ఆసక్తిని కనబరించారు. అదేవిధంగా అమెరికాలో పార్లమెంటు నిర్వహణ, ప్రజా సమ్యసలను ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించే తీరును కూడా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమెరికాలో 12 లక్షల మందికి పైగా తెలుగు వాళ్లు నివసిస్తున్నారని, అందులో 6 లక్షల మంది వరకూ తెలంగాణ వాసులు ఉన్నారని టూరిస్టు వీసాల్లో ఆ కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్సీ రవీందర్ రావు వారిద్దరికీ వివరించారు. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తెలంగాణ వారికి అన్నిరకాల వీసాల నిబంధనల్లో మినహాయింపులిచ్చే విషయమై, ఒక లక్ష డాలర్ల ఫీజు చెల్లింపును తగ్గించే విషయమై పార్లమెంటులో ప్రస్తావించాలని తక్కెళ్లపల్లి వారిద్దరికీ విన్నవించగా, వారు సానుకూలంగా స్పందించి, హామీ ఇచ్చారు. అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులను కలిసిన వారిలో ఎమ్మెల్సీ రవీందర్ రావుతోపాటు సామాజిక విశ్లేషకులు పులి రవి, డాక్టర్ బిక్షం గుజ్జ కూడా ఉన్నారు.



# రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నిరసన

**వరంగల్, ఆయుధం:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రైతులను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో వరంగల్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వోకు సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వరంగల్ లోనూ ఈ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపని నరేందర్ మాట్లాడుతూ. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షత రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు వర్గాలుగా విడిపోయి ప్రజల సంక్షేమం మరిచి వాటాల కోసం కుమ్ములాటలు జరుగుతున్నాయన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని ఒక వ్యక్తికి లీజుకు ఇచ్చారని లీజు తీసుకున్న వ్యక్తి నగరంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని.. త్వరలోనే లీజుకు తీసుకున్న వ్యక్తి చేసిన అక్రమాలను వెలికి తీసి తిన్నదంతా కక్కిస్తామన్నారు.

## బీసీ మహిళలకు అత్యున్నత పదవులు
# చారిత్రాత్మక నిర్ణయం

- సీఎం రేవంత్ రెడ్డికి గుండు సుధారాణి కృతజ్ఞతలు



**వరంగల్, ఆయుధం:** బీసీ మహిళలకు అత్యున్నత పదవులు కట్టబెట్టడం చారిత్రాత్మక నిర్ణయం అని కుడా చైర్ పర్సన్‌గా నియమితులైన గుండు సుధారాణి పేర్కొన్నారు. తనను కుడా చైర్‌పర్సన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. బీసీల పక్షపాతిగా, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బీసీ మహిళలకు అత్యంత కీలకమైన, ప్రధానమైన పదవులు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని ఆమె పేర్కొన్నారు. బీసీ మహిళలకు ఇంతటి ప్రాధాన్యత కలిగిన పదవులు అందించడం కేవలం పదవుల కల్పన మాత్రమే కాదని, బీసీ వర్గాలపై ముఖ్యమంత్రి కి ఉన్న నమ్మకానికి, మహిళల సామర్థ్యంపై ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని బీసీ మహిళల్లో నూతన ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తుపై భరోసాను కలిగించిందని తెలిపారు. బీసీ మహిళలు కూడా నాయకత్వం వహించగలరు, నిర్ణయాలు తీసుకోగలరు, సమాజానికి మార్గనిర్దేశం చేయగలరు అనే బలమైన సందేశాన్ని ముఖ్యమంత్రి ఇచ్చారని అన్నారు. తనపై నమ్మకం ఉంచి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం ఆశయాలకు అనుగుణంగా, బీసీల అభ్యున్నతికి మరియు మహిళా సాధికారతకు చిత్తశుద్ధితో పనిచేస్తానని గుండు సుధారాణి తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ కుడా చైర్మన్ హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, పార్టీ నాయకులకు గుండు సుధారాణి ధన్యవాదాలు తెలిపారు.

## భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** పరకాల డివిజన్ లో నేషనల్ హై వే రహదారులకు సంబందించి భూ సేకరణ మీద ఆర్డీవో, తహసీల్దార్ లతో గురువారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... రహదారుల నిర్మాణాల కోసం భూసేకరణ చేయాలిసిన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ ఉన్న చోట సంబంధిత రైతులతో మాట్లాడి భూ సేకరణ వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తి అయిన చోట సంబంధిత వారికి పరిహారాన్ని త్వరగా చెల్లించాలన్నారు.

# చౌరస్తాలో కాంగ్రెస్ 1000 రోజుల పాలన సంబరాలు

- పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ప్రజా రంజక పాలనలో విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలో సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా సంబరాలను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చౌరస్తాలో టపాసులు కాల్చారు. మిఠాయిలు తినిపించుకుంటూ, "కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వం" వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అద్భుతమైన పాలన సాగిస్తోంది. గత పాలకుల నిరంకుశత్వానికి చరమగీతం పాడుతూ, ప్రజాస్వామ్య బద్ధంగా 'ప్రజా పాలన'ను ప్రజల చెంతకు చేర్చాం. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతులకు రుణమాఫీ వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలిపాం. ఈ 1000 రోజుల ప్రగతి ప్రస్థానం మున్ముందు కూడా ఇలాగే కొనసాగుతుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందుతున్నాయి. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్ గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ మరియు డీసీసీ కమిటీల సీనియర్ సభ్యులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, మహిళా నాయకురాలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా

- 11 మంది లబ్ధిదారులకు రూ.6.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ, ఆయుధం:** అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తోందని తెలిపారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డాక్టర్ కడియం కావ్య కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



# గోల్డ్ యూటర్న్..

**తగ్గినట్లే తగ్గి మళ్లీ ₹1.60 లక్షల స్థాయికి**

**జాతీయం, ఆయుధం:** తగ్గినట్లే తగ్గిన బంగారం ధరలు అనూహ్యంగా మళ్లీ పెరిగాయి. గత ఆరు రోజులుగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఒక్క రోజులోనే 10 గ్రాముల మేలిమి పసిడి ధర దాదాపు రూ.4 వేలు పెరిగింది. దీంతో మళ్లీ రూ.1.60 లక్షల మార్కును చేరుకుంది. బుధవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,100గా ఉంది. హైదరాబాద్‌లో స్పాట్ గోల్డ్ 10 గ్రాముల ధర గురువారం సాయంత్రం 7 గంటల సమయానికి రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. వెండి సైతం దాదాపు రూ.5వేలు మేర పెరిగి రూ.2.41 లక్షలు వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,477 డాలర్ల కొనసాగుతుండగా.. వెండి 66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతలు, చమురు ధరల భయాలతో ఇటీవల బంగారం ధరలు భారీగా క్షీణించిన సంగతి తెలిసిందే. దీంతో బంగారం ధరలు మరింత తగ్గుముఖం పడతాయని అంతా ఊహించారు. ఈ క్రమంలోనే అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడి క్షీణించడంతో బంగారం, వెండికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు ఉద్యోగాల కల్పనకు సంబంధించిన డేటా అంచనాలు కంటే తక్కువ రావడం ఇందుకు కారణం. దీనివల్ల వడ్డీ రేట్ల పెంచాలన్న ఫెడ్ నిర్ణయానికి బ్రేకపడినట్లయ్యింది. దీంతో అమెరికా డాలర్‌తో పాటు, ట్రెజరీ బాండ్ల రాబడులు సైతం తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

## భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను
# త్వరగా పూర్తి చేయాలి: బల్దియా కమిషనర్ వెంకన్న

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న



**వరంగల్, ఆయుధం:** భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. వరంగల్ నగరంలోని భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన బల్దియా ఇంజినీరింగ్, కుడా అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి పరిశీలించారు. ఈ సందర్భంగా బండ్‌పై కొనసాగుతున్న వివిధ ఇంజినీరింగ్ పనుల పురోగతిని, ఇప్పటికే పూర్తయిన పనుల పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బండ్‌పై నిర్మిస్తున్న టాయిలెట్ల పనులను పరిశీలించిన కమిషనర్, వాటిని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బండ్‌పై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్ పరిసరాల సుందరీకరణతో పాటు, భవిష్యత్‌లో నిర్వహణకు అవసరమైన చర్యలను కూడా ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం, సౌకర్యవంతమైన సేవలు అందేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడవద్దని కమిషనర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?: విప్

- కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోవడంలో కొండా సురేఖ విఫలం
- పదేపదే విమర్శలు చేసి ప్రభుత్వాన్ని పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేశారు.

**హైదరాబాద్, ఆయుధం:** మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయం కృతాపరాధమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అనేక అవకాశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ''కుటుంబ సభ్యులను కొండా సురేఖ అదుపులో పెట్టుకోలేకపోయారు. ఈ విషయంలో ఆమె విఫలమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డిపై పదేపదే విమర్శలు చేసి ప్రభుత్వాన్ని, పార్టీని బలహీనపర్చే ప్రయత్నం చేశారు. కొండా సురేఖ వ్యవహార శైలిని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించారు. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారని కొండా సురేఖ అబద్ధాలు చెబుతున్నారు. సీఎంకు ఆ అవసరమేంటి?

ఆమెకు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. పదే పదే తప్పులు చేశారు. ముఖ్యమంత్రిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తుంటే కనీసం వారించలేదు. గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సీఎం సర్దుకుపోయారు. ఇప్పుడు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడినా సీఎం ఎక్కడా బయటపడలేదు. సోనియా, రాహుల్‌పై గౌరవముంటే కాంగ్రెస్‌ను బలహీనపర్చే పనులు ఎందుకు చేశారు? కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారు. సీఎంకు చిన్నారెడ్డి చాలా ఇష్టమైన నాయకుడు. కానీ పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఒక్కటేనని సీఎం రేవంత్ భావించారు. పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపర్చే చర్యలను ఉపేక్షించబోమని అధిష్ఠానం స్పష్టం చేసింది'' అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

- దేశంలోనే పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ప్రవేశం పెట్టిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ
- తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ధర్మసాగర్, ఆయుధం:** దేశంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టిన మొట్ట మొదటి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండలం కాషాగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎమ్మెల్యే , కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు రుచికరమైన అల్పాహారాన్ని వడ్డించి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం చిన్నారుల మధ్య కూర్చొని వారితో ముచ్చటిస్తూ వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో 12లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే , కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..... రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులు ఆకలి ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలోచించి విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన పౌష్టిక అల్పాహారం అందించడంతో పాటు చదువుపై విద్యార్థుల ఏకాగ్రత పెంచాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. కాషాగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన అల్పాహారం అందించి పథకాన్ని ప్రారంభించుకున్నామని వెల్లడించారు.

సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. వారంలో ఒక్కో రోజు ఒక్కో రకంగా బోండాలు, పూరీలు, ఉప్మా, ఇడ్లీ, వడ తదితర అల్పాహారాన్ని విద్యార్థులకు అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు వచ్చి అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. దేశంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 92 మంది విద్యార్థులు ఉన్నారని, దీనిని అప్పర్ ప్రైమరీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్న గ్రామస్థుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తే అదనంగా రెండు తరగతి గదులు, అవసరమైన ఉపాధ్యాయులను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. అయితే గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు.

కాషాగూడెం గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామని, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఏడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గ్రామపంచాయతీ భవనం, మరిన్ని సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యద్ సత్తార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ బావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ జహాన్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఘనంగా ఉట్ల పండుగ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ 43వ డివిజన్లో గల అభ్యాస హై స్కూల్ లో ఘనంగా ఉట్ల పండుగ వేడుకలు జరిగాయి. శ్రీకృష్ణా అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ ఉట్ల పండుగను ప్రారంభించి, మాట్లాడుతూ ఉట్ల పండుగ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉన్నదని.. భగవాన్ శ్రీ కృష్ణుని ఆశీసులు ఉంటే ఏ పనైనా తేలికగా జరిగిపోతుందని అన్నారు. విద్యా ఒక్కటే ప్రదానం కాదు దానికి తోడు పండుగల యొక్క ప్రాధాన్యతలను తెలియజేయడం అభ్యాస హై స్కూల్ ఆనవాయితీ అని చెప్పారు. విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడం పాఠశాల కర్తవ్యం అని ప్రిన్సిపాల్ మండల శిరీష అన్నారు. ఈ కార్యక్రమంలో చీకటి సమ్మయ్య, కోల రాము, ప్రణయ్, రజినీ, భారతి, సృజన, సుమ, స్వాతి, మనీషా, రబ్బానీ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉట్లు కొట్టిన కార్యక్రమాన్ని చూసి పేరెంట్స్ ఆనందాన్ని పంచుకున్నారు. గోపిక, కృష్ణ వేషాధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.




Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695